క్లుప్తంగా

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి



నాగిరెడ్డిపేట: మండలంలోని చిన్నఆత్మకూర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. తామిచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు.

పొలం కోసం పోరాటం



నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన పెద్ద పోషబోయి తనకున్న 2.50 ఎకరాల పొలాన్ని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని విచారించి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. బాధిత కుటుంబానికి మద్దతుగా సీపీఎం నాయకులు రవీందర్ దీక్షలో కూర్చొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామంలో బీటీరోడ్డు పనులను శనివారం ఎంపీపీ శారద, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. రోడ్డు కోసం రూ. 20 లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బురాని సమత, ఎంపీటీసీ దోర్నాల లక్ష్మి, ఉపసర్పంచ్ నరేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం



కామారెడ్డి టౌన్: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. తాగునీటి యంత్రాన్ని శనివారం డిపో మేనేజర్ లక్కు మల్లేషం ప్రారంభించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామానికి చెందిన దళిత యువకుడు గజ్జల మారుతిని కులం పేరుతో దూషించినందుకు అదే గ్రామానికి చెందిన ఆగం హన్మండ్లు, ఆగం మారుతిపై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి బాన్సువాడ డీఎస్పీ జనార్దన్‌రెడ్డి శనివారం విచారణ చేశారు. డీఎస్పీ వెంట ఎస్సై కోనారెడ్డి ఉన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి అంగన్‌వాడి కేంద్రంలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ వైద్య పరీక్షలు నిర్వహించిన సమస్య ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు బీమా రెన్యూవల్



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీకి చెందిన 43 వేల మంది కార్యకర్తలకు బీమా సౌకర్యాన్ని రెన్యూవల్ చేసేందుకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సొంత డబ్బు రూ. 10 లక్షలు చెల్లించినట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావుకు ఆయన చెక్కును అందజేశారు.

రాహుల్ గొంతు నొక్కేందుకు కుట్ర

- ఆయనంటే బీజేపీ నేతలకు భయం
- న్యాయం జరిగే వరకు రాహుల్‌గాంధీకి బాసటగా ఉంటాం
- పలువురు కాంగ్రెస్ నేతల వెల్లడి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గొంతు నొక్కేందుకే బీజేపీ నేతలు కుట్ర పన్ని ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆ పార్టీ నేతలు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



గాంధారిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి: రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రతో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తేటతెల్లమైంది. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని బీజేపీ నాయకులు కుటిల రాజకీయం చేసి రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. ఓ కేసులో రాహుల్ గాంధీకి గుజరాత్ కోర్టు జైలు శిక్ష విధించినా అప్పీల్‌కు వెళ్లేందుకు ఒక నెల సమయం ఇచ్చినా ఆఘమేఘాలపై ఆయన సభ్యత్వాన్ని ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు, నాయకులు లైన్ రమేష్, మధార్, మోహన్ నాయక్ మిట్యా నాయక్, ప్రవీణ్ గౌడ్, వెంకట్ రెడ్డి, సంగెం రాజు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వ రద్దు నిర్ణయాన్ని బీజేపీ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబానీ, ఆదానీలకు కేంద్రం కల్పిస్తున్న ప్రయోజనాలపై లోక్‌సభలో మాట్లాడటంతో బీజేపీ నేతలు ఓర్వలేక రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అఫీజ్, నాయకులు చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: ప్రజాదరణ చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కాసుల బాల్‌రాజ్ ఆరోపించారు. ఆయన సభ్యత్వం రద్దు అప్రజాస్వామికం అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మంత్రి గణేష్, గుడాల నగేష్, నబీ, రఘు, రెంజర్ల సాయిలు, గంగాధర్, వెంకన్నయాదవ్, జీవన్ పాల్గొన్నారు.

సదాశివనగర్: బీజేపీ కుట్ర పూరితంగా రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య పేర్కొన్నారు. ఆదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని మాట్లాడినందుకు అనర్హత వేటు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీకి మద్దతుగా నిలుస్తామని వెల్లడించారు. నాయకులు సంతోష్ పాటిల్, అశోక్ రెడ్డి, నరేశ్‌గౌడ్, గౌస్, రవీందర్ నాయక్, సాయిరెడ్డి, చిందం రాజయ్య, నరేందర్, నర్సారెడ్డి, బాల్‌రాజు, రాజయ్య పాల్గొన్నారు.

తాడ్వాయి: రాహుల్ గాంధీకి న్యాయం జరిగే వరకు ఆయనకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయడం సమంజసం కాదన్నారు.

రామారెడ్డి: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వ పాలను ఎండగడతామని జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తమకు వ్యతిరేకంగా ఉంటే ఏమైనా చేస్తామనే రీతిలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



సదాశివనగర్‌లో..



బాన్సువాడలో..



తాడ్వాయిలో మాట్లాడుతున్న నాయకులు

పరీక్షా కేంద్రాల పరిశీలన



పిట్లం పరీక్ష కేంద్రంలో సెక్టోరల్ అధికారులు

పిట్లం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా స్థానిక బ్లూబెల్స్, జిల్లా ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లపై శనివారం జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు శ్రీపతి, వేణుగోపాల్ పరిశీలించారు.

జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

పెద్దకొడప్‌గల్: పదో తరగతి పరీక్షలు నిర్వహించే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని నిర్వాహకులకు ఎస్సై కోనారెడ్డి సూచించారు. జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులతో ఎస్సై శనివారం సమావేశం ఏర్పాటు చేసి నియమ నిబంధనలను వారికి తెలియజేశారు. అతిక్రమించి ఎవరైనా జిరాక్స్ సెంటర్లు ఓపెన్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కామారెడ్డి రూరల్: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్యాసంపల్లి పాఠశాల హెచ్‌ఎం తాడ్వాయి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. అన్నారు. శనివారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, సురేందర్, అఖిల్ హుస్సేన్, అజ్జు, ప్రకాష్, నరసింహారావు, మహేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



బాణాపూర్‌లో కుస్తీ పోటీల్లో మల్లయోధులు



నర్వలో విజేతకు వెండి కడియం బహుకరిస్తూ..

లింగంపేట: మండలంలోని బాణాపూర్‌లో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. టెంకాయ, వెండి కడెం కుస్తీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి కవిత, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని నర్వ గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు గ్రామానికి చెందిన చింతల సంతోష్‌సేట్ వెండి కడియాన్ని బహూకరించారు.

పిట్లం: మండల కేంద్రమైన పిట్లంలో నిర్వహించిన కుస్తీ పోటీలు నువ్వా నేనా అనే రీతిలో సాగాయి. విజేతలకు సర్పంచ్ జోన్న విజయ శ్రీనివాస్ రెడ్డి నగదు బహుమతి అందజేశారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని బిక్కనూర్, అల్మాజీపూర్ గ్రామాల్లో కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డీఎస్పీ జగన్నాథరెడ్డి

నిజాంసాగర్: అపరిచిత వ్యక్తుల పట్ల మహిళలు, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని తున్కిపల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, ఓటీపీ నంబర్ల వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగాల వసంతరాంచెందర్, ఎంపీటీసీ లచ్చవ్వ, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, స్థానిక ఎస్సై నాగగోని రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మారెడ్డి అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ మహ్మద్ అబ్దుల్ అలీ పౌష్టికాహారాన్ని అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయి

కామారెడ్డి క్రైం: ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం నియోజకవర్గంలోని 287 మంది లబ్ధిదారులకు రూ. 2.87 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందన్నా ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, జెడ్పీ వైస్ చైర్మన్ పర్కి ప్రేమ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుంబాల రవి యాదవ్, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని పలువురి లబ్ధిదారులకు శనివారం కామారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీపీ దశరథ్ రెడ్డితో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజాగౌడ్, జగదాంబ తండా సర్పంచ్ రాజు నాయక్, స్కూల్ తండా సర్పంచ్ లలిత, బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్ రావు, బుచ్చిరెడ్డి నాయక్ పాల్గొన్నారు.

రాజంపేట: ఆడబిడ్డల తల్లిదండ్రుల భరోసా కోసమే సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ లింగాల స్వరూప అన్నారు. మండలంలోని పలువురి లబ్ధిదారులకు శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కామారెడ్డిలో చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సావిత్రి, సర్పంచ్‌లు సౌమ్య, పి గంగకిషన్ పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని లబ్ధిదారులకు ఎంపీపీ గాలిరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగభూషణం గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మత్స్యకారులకు అండగా ఉంటాం



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి అర్బన్: మత్స్యకారులకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా గంగపుత్ర ఉద్యోగుల సంక్షేమ సంఘం ముద్రించిన డైరీని శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గంగపుత్ర ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఎం.రాజన్న, పాక వెంకటి, కేపీ అనిల్‌కుమార్, చిన్నపోచయ్య, రాము, ప్రభాకర్, రవీందర్, శ్రీనివాస్, నరేష్, జుగల్‌కిషోర్, రాజేష్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించలేదని వైన్‌షాప్ మూసివేయించారు



మద్దెలచెరువులో వైన్ షాప్‌ను మూసివేయించిన పంచాయతీ సిబ్బంది

పిట్లం: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో నిర్వహిస్తున్న వైన్‌షాప్‌నకు సంబంధించి బకాయిలున్న రూ. 5 వేలు పన్ను చెల్లించలేదని పంచాయతీ సిబ్బంది శనివారం వైన్‌షాప్‌ను బంద్ చేయించారు. పన్ను చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ పండిత్‌రావ్ తెలిపారు. జనావాసాలు, ఆలయాల వద్ద ఉన్న వైన్‌షాప్‌ను అక్కడి నుంచి తరలించి గ్రామ శివాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నగదు రహిత లావాదేవీలపై దృష్టి

లింగంపేట: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో శనివారం మహిళా సంఘాలు, పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, మహిళా సంఘాల సభ్యులకు నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం కార్డులు, ఫోన్‌పే, గుగూల్‌పే, పేటీఎం ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌రెడ్డి, సీసీ నజీర్, వీఎల్ విజయ, సీఏలు అర్చన, హేమలత, శ్యామల, వివోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

సమాచారం..

■ **నేడు మంత్రి రాక**

సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో బీటీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించేందుకు ఆదివారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీ పాటిల్ రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నాగాగౌడ్‌లు తెలిపారు.

■ **బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం..**

నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ తదితరులు హాజరవుతారని ఎంపీపీ వెల్లడించారు.

■ **కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం..**

భిక్కనూరు: మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు 2వ తేదిన ఆ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని వెల్లడించారు.

అభివృద్ధి పనులే విజయానికి నాంది

- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం ఫత్లార్‌పూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని, ప్రతి ఒక్క కార్యకర్త ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లి వాటి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. విద్య, వైద్య రంగాలలో ఎన్నో మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠల్, జెడ్పీ చైర్మన్ ధఫెదార్ శోభ, మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదార్ రాజు, ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పీటీసీ నాల్చర్ భారతి, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సర్పంచ్ అరుణ కుమార్, సొసైటీ చైర్మన్ బాలు, వైస్ చైర్మన్ యాదవరావు, బీఆర్‌ఎస్ నాయకులు వెంటక్‌రావు, రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మికం

■ **కొండగట్టుకు పాదయాత్ర**



బాన్సువాడ నుంచి వెళ్తున్న హనుమాన్ భక్తులు

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన పలువురు హనుమాన్ దీక్ష స్వాములు శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పాత బాన్సువాడ హనుమాన్ ఆలయంలో ఇరుముడి కట్టుకొని పాదయాత్రగా వెళ్లినట్లు గురుస్వామి ఉపమహేష్ తెలిపారు.

■ **ఆలయ అభివృద్ధికి రూ. 3.48 లక్షల విరాళం**



మద్నూర్: మండలంలోని హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి మద్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగిశెట్టివార్ సంతోష్ రూ. 3.48 లక్షల నగదును శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తన పూర్వీకులకు చెందిన ఆలయం శిథిలావస్థకు చేరుకుందని, అందుకుగాను అభివృద్ధి పనుల కోసం తాను ఇచ్చిన డబ్బును వినియోగించాలని ఆయన కోరారు.

సంక్షిప్తం

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

భిక్కనూరు: మండలంలోని మోటాట్‌పల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు.

విహారయాత్రకు విద్యార్థులు

రాజంపేట: మడంలంలోని ఆరేపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు విహారయాత్రలో భాగంగా ఏడుపాయల వనుదుర్గా దేవి ఆలయం, మెదక్ చర్చ్‌ను సందర్శించినట్లు హెచ్‌ఎం అయతా బాలాజి తెలిపారు.

చిన్నారులకు అన్నప్రాసన

మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్ గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు లత వారికి పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, సుమలత, ఆశ వర్కర్లు లలిత, బాలమణి, దుర్గవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్: మండలంలోని మోడెగాం గ్రామంలో శనివారం రెడ్డి సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశిరెడ్డి రాజేశ్‌రెడ్డి, కార్యదర్శిగా లోక పెద్ద రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సాయిరెడ్డి, నీలం రెడ్డి, సంతోష్‌రెడ్డి, సంజీవరెడ్డి, భైరవస్వామి, అంజల్‌రెడ్డి, జౌడి సాయిరెడ్డి, లింగారెడ్డిలు ఎన్నికయ్యారు.

రూ. 1.22 లక్షలకు తైబజార్ వేలం

దోమకొండ: మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయంలో శనివారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ నల్లపు అంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గర్డాస్ సందీప్ రూ.1.22 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో బలగం సినిమాను ఉచితంగా ప్రదర్శించినట్లు ఎంపీటీసీ వంగ పుష్పావతి తెలిపారు. కుటుంబం, బంధుత్వాల నేపథ్యంలో తీసిన సినిమాను బలగం సినిమాను ప్రతి ఒక్కరు చూడాలని సూచించారు.

నర్సరీని పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఉన్న నర్సరీని ఎంపీవో ప్రకాష్ శనివారం పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు.

సామూహిక సీమంతాలు

ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ కట్టకిందితండా అంగన్‌వాడి కేంద్రంలో శనివారం సామూహిక సీమంతాలను నిర్వహించారు. పోషన్ అభియాన్ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా వారికి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

